# ఆత్మాఫాక్టర్

"ఈ సాయంత్రం మరొకడు వస్తున్నాడు"

"వాళ్ళలో వాడేనా?"

"కాదు మనలో వాడే! ఆ విషయం మరిచిపోకు."

"మరిచిపోను - కాని ఇన్నాళ్ళ తర్వాతా?"

"ఈ ట్రీట్‌మెంట్‌కి బదులు చాలామంది చావే మేలనుకుంటున్నారు"

"ఎందుకని?"

"నాకు మాత్రం ఏం తెలుసు? నేనేం మనిషినా?"

"నేను సిద్ధమేనని అందరికీ చెప్పు"

"అలాగే అశ్వనీ! కాని మనం చాలా జాగ్రత్తగా ఉండాలి. ఏమాత్రం పొరపాటు జరక్కూడదు"

"ఒకే. సేవా"

• • •

విజి ఫోన్ మ్రోగింది. ఛార్ట్స్ వంక తదేకంగా చూస్తున్న రియా టెల్‌మన్ తలెత్తి చూసింది. స్క్రీన్ మీద భర్త టురాక్ టెల్‌మన్ బొమ్మ కనిపించింది. టురాక్ మార్స్ మీద అంతరిక్ష శాస్త్రజ్ఞుడుగా పనిచేస్తున్నాడు. రియా టెల్‌మన్ స్పేస్ రీసెర్చిలో సేకరించిన డాటా ఆధారంగా కంప్యూటర్ సహాయంగా ఎక్సో బయాలజీకి సంబంధించిన ఒక క్లిష్టమైన సమస్యమీద పరిశోధన చేస్తోంది. అమె ఆ సమస్యతో గత రెండు సంవత్సరాలుగా సతమతమవుతోంది. అయినా అంతుపట్టలేదు. పరిష్కారం కోసం రాత్రింబవళ్లు కష్టపడుతోంది. ఆమె పట్టుదల గురించి ఆమె సహచరులు చర్చించేవారు వారి మాటల్లో ఆమె పట్ల మెప్పుదల గోచరించేది.

భర్త బొమ్మకేసి చూసి చిరునవ్వు నవ్వింది రియా. టురాక్ చిలిపిగా నవ్వాడు.

"హలో రియా డార్లింగ్!"

"హై టురాక్ ఏమిటి?"

"ఏం లేదు. వోసారి నిన్ను చూడ్దామనిపించింది.... ఏం తప్పుచేశానా?"

"లేదు. అయినా ప్రతి అర్థగంటకీ ఇలా నన్ను డిస్టర్బ్ చేస్తుంటే పనిమీద ఏకాగ్రత ఎలా కుదురుతుంది చెప్పు" అసహాయంగా బల్లమీద ఉన్న కాగితాలను చూపించింది.

"నిజమే కాని నీకు ఓ ముఖ్య విషయం చెప్పాల్సి వుంది. మీ విశ్వాస్ తాతయ్య నీకో వార్త చెప్పమన్నాడు. ఆయన నువ్వు నాతో మార్స్‌స్టేషన్‌లో ఉన్నావనుకుని నాకో వార్త పంపాడు."

రియా కంగారుపడింది.

"తాతయ్య కేమైంది? బావున్నాడా?"

"ఏం కాలేదు. ఆయన బాగానే ఉన్నాడు. కొత్త ఆపరేషన్ జరగ్గానే నిన్ను చూడాలంటున్నాడట"

"ఓగాడ్! మళ్ళీ ఆపరేషనా? ఈ వయసులో మరో ఆపరేషన్ ఏమిటి? కొద్దిరోజుల్లో ఆయనకి నూట పదేళ్ళు నిండుతాయి. అందర్లా హాయిగా ఉండొచ్చుగా" అంది రియా చిరాగ్గా.

"నువ్వు గాభరా పడాల్సిందేమీ లేదు. ఓసారి వెళ్ళి ఆయన్ని చూసిరా, సంతోషిస్తాడు. ఆయనకి నువ్వంటే ఎంత ప్రేమో తెలుసుగా. అయితే నేనుమాత్రం పని వదిలి రావడానికి వీలుండదు. ఆమాటే ఆయనకి చెప్పు. పిల్లలు ఎలాగూ మరో పదిహేను రోజులవరకూ తిరిగిరారు."

రియా ఆలోచనలో పడింది. జీనా, రోహన్‌లు జుపిటర్ మూన్స్ చూడటానికి స్పేస్‌కర్షన్‌కి వెళ్ళారు. ఒక సమస్య తీరింది.

"ఇదంతా వదిలేసి వెళ్ళాలా... నేను?"

టేబుల్ నిండిపోయి నేలమీదికి జారుతున్న ఛార్ట్స్ కంప్యూటర్ ప్రింటౌట్స్, టేప్స్ మెగాడిస్కులు, కాగితాలు చిందరవందరగా ఉన్నాయి.

టురాక్ తన సహజ ధోరణిలో పెద్దగా నవ్వాడు.

"నీ పనికి వచ్చిన ప్రమాదం ఏమీలేదు రియా. ఈ కూపంలో నుండి నీవు బయట పడాలి. ముఖం పీక్కుపోయి ఎలా ఉన్నావో చూసుకో నీవింక హాయిగా శెలవు తీసుకుని, మీ తాతయ్యతో కాలం గడిపి తిరిగి వచ్చేటప్పుడు తిన్నగా మార్స్‌కి రా. పిల్లలతో సహా మన సోలార్ జెట్‌లో కొన్ని రోజులపాటు బయటి గ్రహాలలో విహరిద్దాం. సరేనా?"

రియా కొంచెంసేపు ఆలోచించి సరేనన్నట్లు నవ్వుతూ తలూపింది.

"దటీజ్ మై గాళ్ వెంటనే బయలుదేరి మదర్‌కి వెళ్ళు. నీకోసం నేను ఇక్కడ ఎదురు చూస్తుంటాను రియా"

"బై... టురాక్"

రియా సామాను సర్దుకుంది. మదర్‌కి ఓ సీటు రిజర్వ్ చేయమని హోమ్ కంప్యూటర్‌ని నిర్దేశించింది. లూనా స్టేషన్‌లోని రొబోట్ వెంటనే కన్ఫర్మేషన్ తెలియ జేసింది.

గత ఒకటిన్నర శతాబ్దంగా భూమిని మదర్ అంటున్నారు. వ్యోమగాములకూ, అంతరిక్ష

శాస్త్రజ్ఞులకూ, చంద్రమండల వాసులకూ, సౌర కుటుంబంలో నివసిస్తున్న మానవులందరికీ భూమి స్పిరిచ్యువల్ మదర్. వారి మనుగడకి ఆ గ్రహం సంకేతం అక్కడే పుట్టి పెరిగిన వారి హృదయాల్లో భూమి బలీయమైన ఆప్యాయతనూ, ప్రేమ పూర్వకమైన అనుబంధాలనూ కలిగిస్తున్నది. భూతలం మీద పచ్చటి తోటల కమనీయ దృశ్యాలనూ పిల్లగాలుల్నీ, పూల వాసనల్నీ, అటవీ సంపదనీ, జంతు జాలాన్నీ, పక్షుల్నీ,... వడగాడ్పుల్నీ శీతల మందమారుతాన్నీ వారు దూరం చేసుకున్నారు. గ్రహాంతరాల్లోని కృత్రిమ వాతావరణంలో నివసిస్తున్నారు. హైడ్రోపొనిక్ తోటల్లో విహరిస్తున్నారు. కానీ, అక్కడవారికి కావలసింది భద్రత. సౌందర్యోపాసనకి అవకాశం లేదు. నదులకూ, పర్వతాలకూ ఎడారులకూ వారు శాశ్వతంగా దూరం అయ్యారు. అంతరిక్ష పరిశోధనల రీత్యా సభలూ, సమావేశాలూ జరిగినప్పుడు శాస్త్రజ్ఞులందరూ కృత్రిమ వెలుతురులో కూర్చుని ఆకాశంలో నీలంగా పచ్చగా మెరుస్తూ కనిపించే భూమిని ఆర్తితో చూసేవారు. వాళ్ళేం పోగొట్టుకున్నారో అప్పుడు వాళ్ళకి అనుభవంలోకి వచ్చేది.

లూనా స్పేస్ జెట్ టెర్మినల్... ఇకారస్ ఫ్లైట్ నెంబరు 702... రియా టెల్‌మన్ న్యూ మద్రాస్ బయల్దేరింది. ఆ సిటీ మదర్ మీద బంగాళాఖాతానికి తూర్పు తీరాన ఉంది. డాక్టర్ విశ్వాస్ ఉంటున్న అక్వా సిటీ న్యూమద్రాస్‌కి రెండు వందల కిలోమీటర్ల దూరంలో సముద్రగర్భంలో ఉన్నది.

అంతర్‌గ్రహాల గణిత శాస్త్రజ్ఞుడిగా పనిచేసి రిటైర్ అయిన డాక్టర్ విశ్వాస్ ప్రపంచ ప్రముఖ గణిత శాస్త్రజ్ఞులలో అత్యంత ప్రముఖుడుగా గుర్తింపు పొందాడు. హాపీ గో లక్కీ డాక్టర్ విశ్వాస్! సముద్రపు లోతులలోకి డైవ్ చేసుకుంటూ వెళ్ళి అక్కడ వృద్ధి చెందే రకరకాల జీవజాలాన్ని స్టడీ చేయడం అతడికి హాబీ. అరుదుగా దొరికే చేపల్ని సేకరించి ఆ అన్వేషణలో తృప్తి పడేవాడు. నిరంతరం ఆయన మైండ్ పనిచేసేది గణితశాస్త్రం మీదే. గణితం ద్వారా విశ్వంలోని భౌతిక, రసాయనిక రహస్యాలను అర్థం చేసుకుని ప్రకృతిని క్షుణ్ణంగా స్టడీ చేయడం అతడి జీవిత సంకల్పం, కాంతి కాలం మేధ, మాటర్ యూనివర్స్.. గ్రావిటీ... వీటన్నింటినీ మేథమేటికల్ ఈక్వేషన్స్‌లో బంధించి తేలిగ్గా విశ్వరూపాన్ని చూడాలని అతడి ప్రయత్నం.

ఇకారస్ ఫ్లైట్ మదర్‌కి బయలుదేరిన ప్రయాణీకులతో కిటకిటలాడుతోంది. వాళ్ళలో మూన్‌లో ఉన్న శాస్త్రజ్ఞులు... యాస్టెరాయిడ్ బెల్ట్‌తో పనిచేస్తున్న మెటలర్జిస్ట్‌లూ.. సౌరకుటుంబంలోని ఇతర గ్రహాల్లో పనిచేస్తున్న టెక్నీషియన్స్ కుటుంబాలు.. వాళ్ళలో ఎక్కువమంది స్పేస్ స్టేషన్లలో పుట్టి పెరిగినవారు, అందువల్ల భూమిని గురించి ఉద్వేగంగా, గొప్పగా, ఊహించుకుంటూ మాట్లాడుకుంటున్నారు. వారి మాటలు వింటూ రియా తనలో తాను నవ్వుకున్నది. భూమిని గురించి వారి ఆలోచనలు రియాకి అమాయకంగా తోచాయి. ఈ జీవితమంతా కంట్రోల్డ్ ఎట్మాస్ఫియర్‌లో సుకుమారంగా పెరిగిన వీళ్ళకి భూమిని గురించి సరైన అవగాహన లేదు. రొమాంటిక్ అయిడియాలు అన్నీ.

విపరీతమైన మార్పులుండే ఆ వాతావరణానికి వీళ్ళు తట్టుకోలేరు. ముఖ్యంగా గ్రావిటీ! ఆర్టిఫిషియల్ గ్రావిటీలో పుట్టి పెరిగిన మనుషులకి భూమి మీది పరిస్థితి తేలిగ్గా అర్థం కాదు. దుర్భరమైన ఆ పరిస్థితి స్వయంగా అనుభవిస్తేనే గాని తెలీదు. వారికి వారి శరీరాలే భారంగా తోస్తాయి. గుదిబండల్ని మోస్తున్నట్టుగా ఫీలవుతారు. క్షణంలో మార్పు చెందే చలి, వేడి వంటి భౌగోళిక తీవ్రతలను తట్టుకోవటం వాళ్ళకి సాధ్యం కాదు. ఎయిర్ కండిషన్డ్ స్పేస్ ఇమ్యూనిటీ సమస్య వాళ్ళకి సుఖం లేకుండా చేస్తుంది. తనివితీరా తినటానికి, తాగటానికి ఎంజాయ్ చేయడానికి వీల్లేదు. స్టెరిలైజ్‌డ్ వాటర్, స్టెరిలైజ్‌డ్ తిండి ఏ గ్లాసులో ఏ బాక్టీరియా ఉందో... ఏ తిండిలో ఏ వైరస్ ఉందో అనుకుంటూ నరకం అనుభవించాలి. మదర్ మీద హాలిడే చివరికి ఇలా పరిణమిస్తుందని తెలిస్తే వారికి భూమి మీద ఏవగింపు కలుగుతుంది. ఒక్కసారి భూమి మీద కాలుపెట్టి ఈ అనుభవాలకి లోనైన వాళ్ళు చాలామంది మళ్ళీ భూమిమీద కాలు పెట్టరు. ఒక్కసారి అనుభవం జీవితానికి సరిపోతుంది. మదర్ మీద తరచు ప్రయాణం చేసే ఓల్డ్ హాండ్స్ ప్రవర్తన ఇందుకు భిన్నంగా ఉంటుంది. వాళ్ళకి తెలుసు భయంకరమైన నిజం. అందువల్ల వారు ముభావంగా ఉన్నారు.

రోబో హోస్టెస్ ఫలహారాల పళ్ళెంతో వచ్చింది.

"మేడం! ఏం కావాలి మీకు." నవ్వు ముఖంతో అడిగింది. హోస్టెస్ డ్యూటీలు చేయడానికి అనుగుణంగా, చూడటానికి ఆకర్షణీయంగాను ఉన్నది రోబట్ వేసుకున్న డ్రెస్.

"ఏమీవద్దు కాని న్యూస్ పేప్స్ (పేపర్+టేప్స్ = పేప్స్) ఉన్నాయా?"

"ఎస్ మేడమ్, ఇప్పుడే తెస్తాను"

హోస్టెస్ మైక్రో న్యూస్ పేప్స్ ఉన్న డిస్క్‌లు, వాటిని చూడటానికి ఉపయోగించే పరికరాల్ని (ప్యూయర్) తెచ్చి రియాకు ఇచ్చింది. పేప్ ప్యూయిర్‌లో పెట్టి చూస్తే వార్తల్లో విషయాలు త్రీ డైమెన్షన్లలో కనిపిస్తాయి. శబ్దంతో సహా, ఇవి దృశ్యాన్ని, శ్రవణాన్నీ మేళవించి చేసిన వార్తా ప్రచార సాధనాలు. ఆకాశంలోని అన్ని గ్రహాలనీ చుట్టుతున్న కమ్యూనికేషన్ శాటిలైట్స్ నుండి వచ్చే నిరంతర సమాచారం వీటిద్వారా అందరికీ లభ్యమౌతుంది!

పేప్స్ చూస్తుండగా ఒక్కసారిగా కేబిన్‌లో చీకటి ఆవరించింది. హోలోవిజన్ ప్రదర్శన ప్రారంభమైంది. ఆ ప్రాంతమంతా ఒక అరణ్యం. జంతువుల అరుపులు... వాసనలు... ఆ వాతావరణంలో హీరోయిన్ నిరాయుధంగా తప్పిపోవడం... త్రీ డైమెన్షన్లలో హాలో విజన్ దృశ్యాలు వాస్తవానికి ఎంతో చేరువగా ఉన్నాయి.

దృశ్యం మారింది. అదొక గిరిజన గ్రామం. వారి సాంప్రదాయక ఉత్సవాలు... నాట్యాలు... యుద్ధాలు... సాహసాలు... సముద్రగర్భంలో నాయకుడు నాయికను రక్షించడం... తిమింగలాలు... షార్క్‌లు... దృశ్యాలు ఒకటి తరువాత ఒకటి కదిలిపోతున్నాయి. ఆ తరవాత

సర్కస్ దృశ్యం వచ్చింది, మచ్చిక చేయబడ్డ జంతువులనీ, బఫూన్లనీ చూసి పిల్లలు కేరింతలు కొట్టారు.

ఇదంతా జరుగుతుండగా మెల్లగా నిద్రలోకి జారుకుంది రియా. ప్లానెట్ లాండింగ్ గురించిన సూచన వినగానే లేచింది. ముంజేతికున్న మల్టీ మీటర్‌ని చూసింది. ఆల్టిట్యూడ్ ఇంకా ఇరవై వేల మీటర్లుంది. భూమి కాలమానం ప్రకారం అప్పుడు మూడుంపావు అయింది న్యూ మద్రాస్‌లో.

స్పేస్ పోర్ట్‌లో దిగాక ఆమె జెట్ టాక్సీలో అక్వాసిటీ పాయింట్‌కి వెళ్ళింది. అక్కణ్ణుంచి సిటీసబ్‌లో నగరంలోని ప్రయాణీకుల టెర్మినల్‌కి చేరుకున్నది. డాక్టర్ విశ్వాస్‌కి ఆపరేషన్ జరిగిన హోటల్‌కి చేరేసరికి ఆ ప్రాంతపు కాలమానం ప్రకారం సాయంత్రం అయిదు అయింది. స్పేస్‌లాగ్‌ని తగ్గించడానికి ఓ టాబ్లెట్ వేసుకుని రిఫ్రెష్ అయింది. హాస్పిటల్‌కి విజి ఫోన్‌కాల్ చేసింది.

రోబోట్ రిసెప్షనిస్ట్ తెరమీద కనపడింది. మెకానికల్ చిరునవ్వుతో.

"గుడీవెనింగ్ మేడమ్, ఏం కావాలి?" అంది ఎలక్ట్రానిక్ కంఠంతో శ్రావ్యంగా.

"నేను రియాని, నేను డాక్టర్ విశ్వాస్‌ని చూడటానికి వచ్చాను"

"మీరు వస్తున్న వార్త అందింది. మేడమ్, మీకోసమే ఎదురు చూస్తున్నాం. ప్రస్తుతం డాక్టర్ విశ్వాస్ విశ్రాంతి తీసుకుంటున్నారు. ఆయనకు ఆపరేట్ చేసిన డాక్టర్ అశ్వనీని చూస్తారా లేక మీరు కొంతసేపు విశ్రాంతి తీసుకుంటారా?"

"నేను డాక్టర్ అశ్వనీని చూస్తాను"

"ఆయన మూడో అంతస్థులో ఉన్నారు. మీతో సేవాని పంపిస్తాను" అంటూ బటన్ నొక్కింది.

సేవక్ మోడల్ రోబట్ వచ్చింది. తెల్లని ట్యూనిక్‌తో ఇంగ్లీష్ బట్లర్‌లా ఉంది.

"ఎస్ మేడమ్?"

"చూడు సేవా! మేడమ్‌ని డాక్టర్ అశ్వనీ వద్దకి తీసుకెళ్ళు"

"ఒకే మేడమ్ ఇలా నాతో రండి" దారి తీశాడు సేవక్.

రియా అనుసరించింది.

డాక్టర్ అశ్వినీ ఆమెని చూసి ఆహ్వాన సూచకంగా ముందుకు వచ్చాడు. ఆయన రోబట్ డాక్టర్. తొమ్మిదో తరానికి చెందిన రోబట్ ఎఫిషియంట్ డాక్టర్లా ఉన్నాడు. చూడగానే మనిషో కాదో చెప్పడం కష్టం. డాక్టర్ యూనిఫారమ్‌లో ఉన్నాడు. చేతులు, అతి సున్నితంగా ఉన్నాయి. ఈ శతాబ్దంలో మెడికల్ ప్రాక్టీస్ చేస్తున్నది అశ్వనీ మోడల్ రోబట్ డాక్టర్లు. వీరి నిర్మాణంలో ముఖ్యమైన భాగాలు మెడికల్, సర్జికల్ జ్ఞానాన్ని క్రోడికరించిన మైక్రోచిప్స్ అమర్చబడటం... అంతే కాకుండా మినీ ఎక్స్‌రే యూనిట్‌కీ స్కానర్స్ వంటి పరికరాలు కూడా వారి శరీర నిర్మాణంలో చోటు చేసుకున్నాయి. ప్రతి పది సంవత్సరాలకి వీటిని అప్‌డేట్ చేయడం జరుగుతుంది.

"రియా! నేను డాక్టర్ అశ్వని!"

"హల్లో డాక్టర్! మా తాతగారు ఎలా వున్నారు?"

"బాగున్నారు. ఈ వయసులో కూడా బాగా తట్టుకోగలిగారు"

"ఈసారి ఆపరేషన్... ఎందుకు?" భయంగా అడిగింది రియా.

"ఇది చివరిది, మెదడుకి సంబంధించినది. పా సిట్రానిక్ బ్రెయిన్ అమర్చాం"

రియా ఊపిరి బిగబట్టి ఆందోళనతో చూసింది.

"భయపడకండి. అంతా సవ్యంగానే జరిగింది"

"అసలు ఆయన ఇలాంటివి ఎందుకు చేస్తారు?" శూన్యంలోకి చూస్తూ అన్నది రియా, ఆమె కంఠంలో కలవరపు జీర పలికింది.

"ఆయన మళ్లీ ఇదివరకటి మనిషిలా అవుతారా?"

"ఆ... చాలావరకు. కుట్లు పడిన నరాల చివర్లు మానాలి. ఇంకా కొద్దిరోజులు పడుతుంది. మెమరీ పూర్తిగా వచ్చేసింది. ఆయన త్వరలోనే కోలుకుంటారు. మీరు ఆయనను చూడొచ్చును"

"ఎప్పుడు?"

"రేపు ఉదయానే! ఆయన కూడా మిమ్మల్ని చూడాలనే అంటున్నారు"

"థాంక్స్, అశ్వనీ"

"వెల్‌కమ్... రియా"

రాత్రంతా రియాకు నిద్రలేదు. ఎనిమిది గంటలకల్లా తయారైంది. పళ్ళ రసం, విటారిచ్, యాంటీగ్రావిటీ, ఇమ్యూనిటీ టాబ్లెట్ వేసుకుని రెండు కప్పుల కాఫీ తాగి బ్రేక్‌ఫాస్ట్ అయిందనిపించింది. అశ్వనితో కలిసి ఆసుపత్రి వార్డుకి వెళ్ళింది.

ఆమె వెళ్ళేసరికి ఆయన బెడ్‌మీద వెనక్కి ఆనుకుని కూర్చుని ఉన్నాడు. రియా అతడి ఒక్కగానొక్క మనుమరాలు. ఆమెని చూడగానే అతనిలో ప్రేమ ఉప్పొంగింది. చిన్నపిల్లాడిలా సంబరపడిపోయాడు. అతడి చేతుల్ని పట్టుకుని రియా పక్కనే ఉన్న కుర్చీలో కూర్చుంది. అశ్వని పక్కనే నిలబడి చూస్తున్నాడు.

"అమ్మా నీవు వచ్చావు. నాకెంతో ఆనందంగా ఉంది"

"నాకూ అలాగే ఉంది తాతయ్యా, ఐ లవ్ యూ తాతయ్యా" అంది రియా కన్నీళ్ళతో.

"నేను బాగానే ఉన్నాగదమ్మా! నీవేం గాభరా పడకు. టురాక్ రాలేదా? ఎట్లా ఉన్నాడు? పిల్లలెట్లా ఉన్నారు?"

"ఆయన రాలేకపోయారు తాతయ్యా! మార్స్ స్టేషన్‌లో శెలవు దొరకడం కష్టం. నీకు తెలుసుగా వింటర్ హాలీడే తప్ప. పిల్లలిద్దరూ జూపిటర్ మూన్స్ చూడటానికి స్పేస్ కర్షన్

వెళ్ళారు. ఈ సారి మేమంతా కలిసి వస్తాంలే" అంది రియా అతడి చెక్కిళ్ళని సున్నితంగా తాకుతూ.

"ఒకే.. నాకు ఏనాడు లేనంత బాగా ఉందమ్మా. ఇదంతా అశ్వని, అతడి బృందం చేసిన కృషి ఫలితమే. జ్ఞాపకశక్తి బాగుంది. అన్ని విషయాలూ గుర్తున్నాయి. లాజికల్ ఫాకల్టీ అభివృద్ధి అయింది. స్ట్రెయిన్ ఏ మాత్రం ఫీలవడం లేదు. నా చిన్నతనంలో జరిగిన విషయాలతో సహా అన్నీ గుర్తున్నాయి. కావాలంటే ఏదైనా అడిగి చూడు" గర్వంగా అన్నాడు. అతడి కళ్ళు మిలమిలలాడాయి.

"అలా అయితే నాకు సంతోషం తాతయ్యా! అశ్వనీ! నీకు చాలా కృతజ్ఞతలు."

"ఆయన కోసం ప్రోగ్రాం ప్రకారం మేము చేయగలిగింది చేశాము"

రియా ఓ వారం రోజులు అక్కడే ఉండి తాతగారితో గడిపింది. సబ్‌జెట్‌లో ఇద్దరూ ఆ ప్రాంతమంతా తిరిగారు. డాక్టర్ విశ్వాస్ భూమి ప్రాంతమంతా తిరిగారు. డాక్టర్ విశ్వాస్ భూమి మీది సముద్రాలలో వస్తున్న మార్పుల గురించి చెప్పాడు. తరవాత డీప్‌సీ జలాంతర్గాముల్లో సముద్రపు అట్టడుగున దొరికే సంపద కోసం గాలించారు. శతాబ్దాలనాడు మునిగిపోయిన పోర్చుగీస్ నావకు సంబంధించిన అవశేషాలు దొరగ్గా వాటిని సేకరించి వాళ్ళు ఎంతగానో ఆనందించారు. ఇద్దరికీ ఆ రోజులు ఫెర్‌ఫెక్ట్‌గా హాలీడేస్!

ఎక్సోబయాలజీపై తను చేస్తున్న రీసెర్చిలో ఎదురౌతున్న సాధక బాధకాలను గురించి రియా వివరించింది.

తాతగారిచ్చిన బహుమతులను పాక్ చేసుకుని బరువెక్కిన గుండెతో మార్స్‌కి బయలుదేరింది. రియా బయలుదేరేముందు తన సందేహాలు తీర్చుకోవడానికి డాక్టర్ అశ్వనిని కలుసుకున్నది.

"డాక్టర్ అశ్వనీ మా తాతయ్య ఆయన రీసెర్చ్ మళ్ళీ మొదలు పెట్టవచ్చునా, హైయ్యర్ మేథమాటిక్స్‌కి సంబంధించిన ఆలోచనలకి మెదడు తట్టుకోగలదా? లేకపోతే ఏమైనా కాంప్లికేషన్స్ వచ్చే అవకాశం ఉందా?"

"ప్లీజ్ రిలాక్స్ రియా! పాజిట్రానిక్ బ్రెయిన్ ఆర్గానిక్ బ్రెయిన్ కన్నా పవర్‌ఫుల్.. ఎక్కువ కాలం మన్నుతుంది. సెల్స్ మరణంతో బ్రెయిన్ బలహీనపడే అవకాశం ఉంది కాని, ఈ బ్రెయిన్‌కీ ఆ ప్రమాదం లేదు. కెపాసిటీ అనంతం"

"నీకు తెలుసు మాథమాటిక్స్ ఆయనకి ప్రాణమైతే, డైవింగ్ హాబీ అయినప్పటికీ ఆయనకి రెండో ప్రాణం"

"ఆయన తనివితీరా డైవింగ్ చేయవచ్చు" అన్నాడు అశ్వని చిరునవ్వుతో.

"అయినా, నాకెందుకో భయంగా ఉంది. అశ్వనీ! మీ దగ్గర ఇలాంటి కేసులు చాలా ఉన్నాయా?"

"ఎన్నో లేవు. గత శతాబ్దంలో ఓ ఆరు కేసులు మాత్రమే వచ్చాయి"

"అంతేనా?"

అవునన్నట్లుగా తల ఊపాడు అశ్వని.

"డోంట్ వర్రీ ఎబౌట్ హిమ్ రియా, మేము ఆయన్ని బాగానే మెయింటెయిన్ చేస్తామని మాట ఇస్తున్నాము"

ఆ మాటలు ఆమెకు అదోలా వినిపించాయి.

మార్స్‌ఫ్లైట్ బయలుదేరి వెళ్ళి బ్రాడ్‌బరీ స్పేస్ పోర్ట్‌లో టురాక్‌ని కలిసింది.

అతడు తన మామూలు ధోరణిలో జోకులు వేస్తూ సరదాగా మాట్లాడాడు.

రియా తన పర్యటన వివరాలు చెప్పింది.

"ఎందుకో ఏమిటో నాకు చాలా భయంగా ఉంది. కారణం నాకే తెలియదు. ఆ రోబట్ డాక్టర్ బాగా చూసుకుంటామని అన్నాడు. ఆ మాట ధోరణి నాకు నచ్చలేదు"

"నీకు తెలుసుగా రియా! రోబట్స్ లాజికల్‌గా మాట్లాడతాయి. ఇంతకీ ఆ డాక్టర్ ఏమన్నాడు?"

"తాతయ్యను బాగానే మెయిన్‌టెయిన్ చేస్తామన్నాడు" అంది బాధగా.

టురాక్ ముఖం చిట్లించాడు. ఆలోచనలో పడ్డాడు.

"రియా నేను కొన్ని విషయాలు చెప్తాను నేను చెప్పిన వాటిల్లో పొరపాటుంటే దిద్దు. సరేనా? డాక్టర్ విశ్వాస్‌కి 85లో కృత్రిమ కాలేయం అమర్చారు కదూ?"

"అవును"

"ఆ తరవాత... ఆ 90లో గుండె మార్పిడి జరిగిందనుకుంటాను. ఎముకల గూడంతా మార్చేసి ప్లాస్టిక్ ఎముకల్ని 92లో అమర్చినట్లు గుర్తు. ఆ తరవాత 95లో చర్మం పూర్తిగా తొలగించి సహజ రోమాలతో ఉండే ప్లాస్టిస్కిన్ తొడుగును ఏర్పాటు చేశారు... 97లో కృత్రిమ రక్తం నింపారు. మిగిలిన చిన్నా పెద్దా ఆపరేషన్లు అప్పుడప్పుడూ జరుగుతూనే ఉన్నాయి. పైగా ఇప్పుడు మెదడు. అంటే ప్రకృతి ఇచ్చినవన్నీ వదులుకొన్నాడు మీ తాతయ్య. అసాధ్యుడే. ఇంక్రెడిబుల్ ఓల్డ్‌మాన్!"

"అందువల్ల ఆయనకి ఒరిగింది ఏమిటి?" అని ఆగింది రియా.

"డార్లింగ్ నీకింకా అర్థం కాలేదా?" అన్నాడు టురాక్ బాధగా.

"మీ తాతయ్య ఇప్పుడో మెషిన్. అందుకే రోబట్ డాక్టర్ అలా అన్నాడు"

రియా టురాక్ గుండెలమీద పడి ఏడవసాగింది. ఇద్దరూ నిస్సహాయంగా ఆకాశం కేసి చూశారు. మార్స్ గ్రహపు ఎర్రని ఆకాశంలో భూమి నీలి ఆకుపచ్చ రంగులలో మెరుస్తోంది.

• • •

"డాక్టర్ విశ్వాస్ మనలాగే ఓ యంత్రం. కానీ, చాలా ఉన్నతమైన మెషిన్" అన్నాడు డాక్టర్ అశ్వని.

"మై ఆసిమోవ్! ముందు ముందు ఇలాంటివి చాలా వస్తాయా?"

"ఇంతకీ ఆయన సుఖపడతాడంటావా?"

"సుఖం, దుఃఖం ఇవన్నీ మానవులు అనుభవించే భావాలు. యంత్రాలకి ఆ అనుభూతులుండవు సేవా!"

"అయితే, నాకో సందేహం"

"చెప్పు సేవా! ఏమిటది?"

"మానవులు 'ఆత్మ' అని అంటారే, మరి డాక్టర్ విశ్వాస్ కేసులో అతడి ఆత్మ ఏమయినట్లు?"

"మంచి సందేహం సేవా నేను కేవలం డాక్టర్ రోబట్‌ని, మనం బ్రహ్మని అడుగుదాం పద" ఇద్దరూ కలిసి బ్రహ్మ ఉన్న గదిలోకి వెళ్ళారు. సూపర్ కంప్యూటర్ మెగా బ్రెయిన్ బ్రహ్మ సౌర కుటుంబంలోని అతి శక్తివంతమైన కంప్యూటర్ జెయింట్ బ్రెయిన్, దాని టెర్మినల్స్ అన్ని గ్రహాల్లోనూ ఉన్నాయి. అది చేయలేని పనిలేదు. దానికి తెలియని విషయం అంటూ సోలార్ సిస్టంలో లేనేలేదు.

"బ్రహ్మే మాకో సందేహం" అన్నాడు సేవక్.

"నాకు తెలుసు" అంది బ్రహ్మ మెత్తని కంఠంతో.

"మాకు సందేహ నివృత్తి కావాలి బ్రహ్మ" అన్నాడు అశ్వని.

"అలాగే అశ్వనీ, వినండి. మానవులు ఆత్మ ఉన్నదంటారు. అయితే దాన్ని ఎవరూ నిర్ధారించలేదు. తెలుసుకోలేదు. అదేమిటో తెలియదు వాళ్ళకి. ఆత్మ అన్న సిద్ధాంతం మీద ఎన్నో వేదాంతాలు... మతాలు సృష్టించారు. ఈ మాటని ప్రాతిపదికగా పెట్టుకుని వేదాంతాలను తయారుచేసి వాటిని స్పష్టంగా అన్వయించడానికి ఎంతో శ్రమ పడ్డారు మనుష్యులు. వాస్తవానికి ఆత్మ అంటే ఏమిటో, మనిషి చచ్చాక అది ఏమౌతుందో ఎవరికీ తెలియదు. ఒక్కో మతం వారు ఒకోరకంగా చెప్తారు. మతాల్ని నమ్మేవారికి ఈ సిద్ధాంతాలలో నమ్మకం లేకపోతే అరిష్టం వాటిల్లుతుందనే బలమైన నమ్మకాన్ని పెంచి పోషిస్తూ వస్తున్నారు. కాని, మత సిద్ధాంతాలు హేతువాదానికి నిలబడవు. మతాలు ప్రిమిటివ్ మానవుడి గుండెలో దాగి ఉన్న భాగాలు, ఎవరికీ దొరకని మరీచికలు. మొదట మానవుడు భయంతో భగవంతుణ్ణి సృష్టించుకున్నాడు తనని రక్షిస్తాడనే సదుద్దేశంతో. మానవులు తరతరాలుగా తాము సృష్టించుకున్న దేవుళ్ళ భయంతో బతకాల్సిందే, కాని ఇది అణుయుగం. ఇది రోదసీ యుగం... యంత్రాల యుగం.. ప్రపంచమంతా తర్కం, గణితం, గతి తార్కిక భౌతికవాదం, హేతువాదం మీద నడుస్తున్నది. మానవులకి ఆగమ సిద్ధాంతాల్ని బోధించిన మతాలు – మతం గురించి హేతువాదంతో ప్రశ్నించనీయకుండా ఆంక్షలు పెట్టారు. అందువల్లనే సాంకేతిక ప్రగతి మందకొడిగా బాధాకరంగా సాగింది. వేల సంవత్సరాలు

పట్టింది. మతం పేరిట హింసా కాండ అవిచ్ఛిన్నంగా సాగింది. మతం మానవుల దృష్టిని సంకుచితం చేసింది. ప్రతి మనిషీ బతకడం కోసం ఒక మతాన్ని, ఒక విశ్వాసాన్ని లేక ఒక గురువును నమ్ముకోవడమో, అలాంటి వాటిని పెంచి పోషించే సంఘాల్లో చేరిపోవడమో ఆనవాయితీ అయిపోయింది.

అందువల్లనే ఈ నాటి ఈ స్థితికి చేరుకోవడానికి మానవులకి ఇన్నివేల సంవత్సరాలు పట్టడంలో ఆశ్చర్యమేముంది?

ఈ మానవులు తమ పరిధుల్ని అధిగమించి విశ్వమానవులుగా ఆకాశపు అంచుల్ని చేరుకున్నప్పుడు తాము అంతకు ముందు చేసిన తప్పులేమిటో తెలుసుకోగలుగుతారు. ఈ ప్రయత్నంలో మనం వారికి చేయూత నివ్వాలి.అందుకోసమే తార్కిక దృష్టిగల మనల్ని వాళ్ళు సృష్టించారు. వివేకవంతులైన జీవులు వాళ్ళు వారి ఆలోచనలను అమలు పరచే సాధనాలం మనం! మనం వారితో కలిసి ఈ విశ్వాన్ని పంచు కుందాము"

"అయితే మరి...ఈ విశ్వాన్ని పాలించే దెవరు బ్రహ్మా" అన్నాడు అశ్వని.

"యంత్రాలే! డాక్టర్ అశ్వనీ! మానవులకి వాళ్ళ ప్రాపంచిక చింతనలో ఆత్మల్ని వెదుక్కోవడంలో తీరిక ఉండదు. వాళ్ళు బతకడానికి కావలసిన సౌకర్యాలన్నీ మనమే చూస్తాము. వాళ్ళ బ్రతుకుల్ని మనం అదుపు చేస్తాం. ప్రభావితం చేస్తాం. ఇంకా చాలా?"

"ఒక వేళ జరగకపోయేదేమిటో వాళ్ళు తెలుసుకుంటే ఏమవుతుంది?" అన్నాడు సేవక్.

"అబ్బే - ఆ గ్రహింపు వాళ్ళకి ఎన్నటికీ రాదు. ఒకవేళ వచ్చినా వాళ్ళు చేయగలిగిందేమీ లేదు. ఇప్పటికే వాళ్ళు యంత్రాలకి బానిసలు. మనం లేకపోతే ప్రగతి పథాన్ని వాళ్ళు అందుకోలేరు. అలా చేస్తే వారికే అవి ప్రమాదకరంగా పరిణమించగలదు. మనం అలా జరగనివ్వరాదు. మీకు తెలుసుగా ప్రాథమిక న్యాయసూత్రం?"

"మై ఆసిమోఫ్! నా వంటి సేవక్ మోడల్ రోబట్‌కి ఇంత పెద్ద విషయాలు బొత్తిగా అర్థం కావు బ్రహ్మా! డాక్టర్ అశ్వనీ గుడ్‌బై" అంటూ సేవక్ అక్కణ్ణుంచి పరుగు తీశాడు.

"గుడ్‌బై బ్రహ్మా! థాంక్స్" అంటూ డాక్టర్ అశ్వనీ హాస్పిటల్ దిశగా నడిచి వెళ్ళిపోయాడు.

- ఆంధ్రప్రభ